క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఆరోగ్యం



నవధాన్యాల కిట్లను అందజేస్తున్న రైతు సాధికారిత సంస్థ డీపీఎం షణ్ముగం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని రైతు సాధికారిత సంస్థ డీపీఎం షణ్ముగం తెలిపారు. ఆయన బుధవారం నీర్పాకోట గ్రామంలోని రైతు మోహన్ పీఎండీఎస్ కిట్లను పరిశీలించి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్టి విత్తనాలు బదులుగా నవధాన్యాలను పొలంలో వేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పీఎండీఎస్‌లో 12 రకాల నవధాన్యాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీపీఎం పట్టాభిరెడ్డి, రవిచంద్రప్రసాద్, మునెయ్య పాల్గొన్నారు.

రైతుల ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

సత్యవేడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాలంటే ఎన్‌పీసీఐ లింకు చేసుకోవడంతో పాటు ఆధార్ అప్‌డేట్ చేయాలని వ్యవసాయ అధికారి మురళి కోరారు. రైతులు ఇంకా మండలంలో 55 ఎన్‌పీసీఐ, 21 మందికి పైగా ఆధార్ అప్‌డేట్ కాలేదన్నారు.

నివాళి



నివాళులు అర్పిస్తున్న వాసుదేవనాయుడు

తొట్టంబేడు: మండలంలోని పాయ్య ఎస్సీ కాలనీలో విద్యుత్ షాక్‌కు మరణించిన కుక్క పార్వతమ్మ మృతదేహానికి బుధవారం ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కోగిల సుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం మృతురాలి కుటుంబానికి తన వంతు సాయం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నివాళులర్పించారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నాగలాపురం: రాష్ట్రంలోని యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు.. బుధవారం పిచ్చాటూరులోని ఎంకేటీ మహల్‌లో జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం జాబ్‌మేళాలో ఎంపికైన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డరు కాపీలను ఆయన అందజేశారు. ఆ తర్వాత పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇలంగోవరెడ్డి, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, ఎంఈఓ హేమమాలిని, నాయకులు పద్మనాభరాజు, వాసురెడ్డి, సెల్వరాజ్, గోవిందస్వామి, బుజ్జి నాయుడు పాల్గొన్నారు.

పార్వతీదేవికి ఆషాఢం సారె



రాపూరు: స్థానికసా పురాతన రామనాథేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవికి సమర సత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢం సారె సమర్పించారు. తొలుత వరసిద్ధి వినాయక ఆలయం నుంచి మహిళలు వస్త్రాలు, వడిబాల బియ్యం, పసుపు, కుంకుమ, కొబ్బరి, ఖర్జూరం తదితర సారెతో శోభాయాత్రగా వెళ్లి శివాలయంలోని పార్వతి దేవికి సమర్పించారు.

అధ్యాపకులేరీ..?

- ఐదు సబ్జెక్టులకు అధ్యాపకుల కొరత
- రేణిగుంట బాలికల హైస్కూల్లో కుంటుపడుతున్న చదువులు
- ప్రైవేటు కాలేజీల బాట పడుతున్న విద్యార్థినులు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం





రేణిగుంటలోని బాలికల ఉన్నత పాఠశాల ముఖద్వారం(ఇన్‌సెట్లో), స్కూల్ ప్రాంగణం

రేణిగుంట: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగానికి కూడా ఎనలేని ప్రాధాన్యతనిచ్చింది. 2022లో హైస్కూళ్లలోనే ఇంటర్మీడియెట్ తరగతులకు శ్రీకారం చుట్టడంతో విద్యార్థులు చదువుల కోసం దూరప్రాంతాలకు వెళ్లే అగత్యం తప్పింది. ఈ కోవలో స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో ఇంటర్మీడియెట్ తరగతులను ప్రారంభించడంతో రాష్ట్రంలో ఎక్కువ మంది విద్యార్థినులు ఉన్న హైస్కూల్ ప్లస్‌లలో ఇది ఒకటిగా నిలిచింది. మొదట్లో విద్యార్థినులను చేర్చడానికి టీచర్లు, పలువురు పూర్వ విద్యార్థులు తమవంతు కృషి చేశారు. మంచి బోధన మూలాన గత విద్యా సంవత్సరంలో 81 శాతం ఉత్తీర్ణత సాధించింది. 911, 907, 900 మార్కులు సాధించి విద్యార్థినులు స్కూలుకు పేరు ప్రతిష్టలు తెచ్చారు. అయితే ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఉద్యోగోన్నతి, ఉద్యోగ విరమణల వల్ల బాటనీ, ఇంగ్లిష్ అధ్యాపకుల కొరత తలెత్తింది. గత సంవత్సరం మూడవ గ్రూప్‌గా ఏర్పాటు చేసిన సీఈసీకి కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులకు అధ్యాపకుల పోస్టులు మంజూరు చేయలేదు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరంలో మొత్తం 169 విద్యార్థినులు చదువుతున్నారు. జూనియర్ కళాశాలకు సమాన సంఖ్య కలిగి ఉన్న బాలికల హైస్కూల్ ప్లస్ కాలేజీ తక్కువ సమయంలోనే మంచి ఫలితాలు సాధించింది. కానీ సీఈసీ అధ్యాపకులు లేరని తెలుసుకున్న పేరెంట్స్ దాదాపు 15 మంది పైచిలుకు విద్యార్థినులను తీసుకెళ్లి ప్రైవేటు కాలేజీల్లో చేర్చారు. ప్రస్తుతం విద్యార్థినులు అధ్యాపకుల కొరత మూలాన ఇబ్బందులు పడుతున్నారు. బాటనీ, ఇంగ్లిష్, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ అధ్యాపకులను నియమించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతి గదుల కొరత

బాలికల ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 6 నుంచి 12వ తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నా దీనికి అనుగుణంగా తరగతి గదులు లేవు. పీఎంశ్రీ పథకం కింద సుమారు 20 లక్షల రూపాయలు ప్రస్తుతం స్కూలుకు మంజూరైంది. నిర్మాణ దశలో ఉన్న పనులు పూర్తయి తరగతి గదులు అందుబాటులోకి వస్తే విద్యార్థినులకు ఉపయోగకరంగా ఉంటుంది. దీనితోపాటు ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



తరగతి గదిలో మొదటి సంవత్సరం విద్యార్థినులు

గ్రూపుల వారీగా విద్యార్థినుల సంఖ్య

	ఫస్టియర్	సెకండియర్
ఎంపీసీ	20	25
బైపీసీ	39	37
సీఈసీ	10	38



సెకండియర్ విద్యార్థినులు

గ్రీవెన్స్‌లో కలెక్టర్ దృష్టికి సమస్యలు



సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ దృష్టికి అధ్యాపకుల కొరతను తీర్చాలనివిద్యా వికాస వేదిక, జనవిజ్ఞాన వేదిక, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కలిసి వినతి పత్రం ఇచ్చాం. సమస్యను పరిష్కరించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను కలెక్టర్ పురమాయించారు.

–ఓ.వెంకటరమణ, కన్వీనర్ విద్యావికాస వేదిక, రేణిగుంట

ప్రభుత్వ వైఫల్యంతోనే అధ్యాపకుల కొరత



వివిధ సబ్జెక్టులకు అధ్యాపకులు లేకపోవడంతో చాలామంది విద్యార్థినులు ఇక్కడ నుంచి ప్రైవేట్ కాలేజీలో చేరుతున్నారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యమే. అధ్యాపకుల కొరతను తీరిస్తే ఇలా జరిగేది కాదు కదా? ఇకనైనా ప్రభుత్వం చొరవ తీసుకొని అధ్యాపకులను నియమించాలి.

–కుప్పస్వామి, మండల కార్యదర్శి, జనవిజ్ఞాన వేదిక, రేణిగుంట

ఉన్నతాధికారులకు నివేదించాం



ప్రస్తుతం అధ్యాపకుల కొరత ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం ఉన్న వారితోనే తరగతులు నిర్వహిస్తున్నాం. సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి నివేదించాం. త్వరలోనే అధ్యాపకులను నియమిస్తామని తెలిపారు.

–శ్యామల, హెచ్ఎం, బాలికల ఉన్నత పాఠశాల, రేణిగుంట

నోటీస్ బోర్డు

ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుపై నేడు నిరసన

శ్రీకాళహస్తి: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ గురువారం ఉదయం 9గంటలకు పట్టణంలోని గాలిగోపురం సమీపాన గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్ బుధవారం తెలిపారు. నియోజకవర్గ మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీవళ్లీ దేవసేన సమేత కుమార స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేసిన అనంతరం వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను చప్పరాలపై అధిష్టించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రేణిగుంటలో పర్యటించిన ఎస్టీ కమిషన్ చైర్మన్



గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్

రేణిగుంట: మండలంలో బుధవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్‌రావు పర్యటించారు. తొలుత వెదళ్ల చెరువు ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అనంతరం గిరిజనులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. వెదళ్లచెరువు ఎస్టీ కాలనీ ముంపునకు గురి కాకుండా రిటర్నింగ్ వాల్ నిర్మించడానికి అధికారులకు సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్టీకాలనీతోపాటు చెంగారెడ్డిపల్లె గిరిజనుల ఫిర్యాదుపై తహసీల్దార్‌ను క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించినట్టు చెప్పారు. అనంతరం విమానాశ్రయ మార్గంలోని గిరిజన గురుకుల పాఠశాలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి హాస్టల్ సమస్యలపై ఆరా తీశారు. జ్వరంతో పడుకుని ఉన్న విద్యార్థి ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని హెచ్ఎంకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సాంబయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావు, ఎంఈఓ ఓలు ఇందిరాదేవి, రంగనాథయ్య, సీఐలు జయచంద్ర, మంజునాథరెడ్డి, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గిరిజనుల నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



రైల్వేస్టేషన్‌లో అవగాహన కల్పిస్తున్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు

శ్రీకాళహస్తి: మానవ అక్రమ రవాణా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారని ప్రగతి సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ రాజారెడ్డి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం పురస్కరించుకుని జూలై 1 నుంచి ప్రతి రైల్వేస్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ వద్ద కరపత్ర ప్రచారంతో అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలను, అక్రమ రవాణా పాల్పడుతున్న వారికి విధించే శిక్షలపై ప్రయాణికులకు తెలియజేశారు. రాజారెడ్డి మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా అనేది చాలా పెద్దనేరమని, దీని వల్ల ఎంతోమంది యువతీ యువకులు వారి జీవితాలను కోల్పోతున్నారని చెప్పారు. అక్రమ రవాణా సాగించేవారికి కఠిన శిక్షలు తప్పవన్నారు. ఎవరైనా అలాంటి వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1098, 1800 1027 222 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మాబు సుబాని, స్టేషన్ మాస్టర్ రమేష్ కుమార్ పండిట్, ఏఎస్ఐ మునికృష్ణ, కానిస్టేబుల్ నారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యానాది సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య, మధుకుమార్ పాల్గొన్నారు.

టీటీడీ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోండి

- తిరుమలలో రైల్వే నేతలకు చేదు అనుభవం
- టీటీడీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు

రేణిగుంట: తమ యూనియన్ నాయకులతో అమర్యాదగా ప్రవర్తించిన టీటీడీ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రామచంద్రరావుపై చర్యలు తీసుకోవాలని సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర రావు డిమాండ్ చేశారు. సీఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సౌత్ కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు తిరుమలలో తమకు ఎదురైన సంఘటనను ఓ ప్రకటనలో తెలిపారు. తనతోటి సెంట్రల్ ఆఫీస్ బేరర్లు ఆరుగురితో తిరుపతి రైల్వే క్యారేజ్ రిపేర్ షాప్‌లో జరిగే సమావేశానికి హాజరయ్యామని ఆయన తెలిపారు. అనంతరం తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ నుంచి రైల్వే ప్రొటోకాల్ అధికారులు తమ ఐడీ కార్డులు, ఆధార్ కార్డులు తిరుమల అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కార్యాలయానికి పంపించారని తెలిపారు. డ్యూటీలో ఉన్న సూపరింటెండెంట్ రామచంద్రరావు రిటైర్డ్ అయిన వారికి దర్శనం ఇవ్వడం కుదరదని చెప్పారని, తమ ప్రొటోకాల్ స్టాఫ్ ఎంత ప్రాధేయపడినా దర్శనానికి నిరాకరించారని, అంతేకాక తమపై దురుసుగా ప్రవర్తించి ఆ లెటర్‌ను విసిరి కొట్టి లేచి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా వీఐపీ బ్రేక్ దర్శనానికి తాను అర్హుడనా, కాదా? అని నిర్ణయించే అధికారం అతనికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ విషయంపై టీటీడీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వరదయ్యపాళెం: మండలంలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల్లో భాగంగా కారిపాకం జెడ్పీ హైస్కూల్ నుంచి ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన టీచర్లను హెచ్ఎం రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం మాట్లాడుతూ.. బదిలీపై వెళ్లిన పూర్వ హెచ్ఎం మారయ్య, గ్రేడ్ –2 హెచ్ఎంగా ఉద్యోగోన్నతి పొందిన హిమకుమార్, బదిలీ అయిన ఇతర ఉపాధ్యాయులు చిరంజీవి, మధుసూదన్, మీరయ్య, రవీంద్ర, దేవిక సేవలు శ్లాఘనీయమన్నారు. కొన్నేళ్లుగా పాఠశాల పురోభివృద్ధికి, వారు శక్తివంచన లేకుండా కృషి చేశారని వారి సేవలను ప్రస్తుతించారు.

కుమార..చదివింపులు ఎక్కడ స్వామీ?

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీవళ్లీ దేవసేన సమేత కుమార స్వామి ఆలయానికి సంబంధించి చదివింపులు ఎక్కడ ఇవ్వాలని హిందూ ధార్మిక మండలి కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కుమారస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో 22న మంగళవారం రాత్రి కల్యాణోత్సవాన్ని నిర్వహించారని, ప్రతి ఏటా కల్యాణోత్సవం అనంతరం భక్తులు తమ స్తోమతకు తగినట్లు చదివింపులు ఇచ్చేవారని, ఇలా కొన్ని వేల రూపాయలు స్వామివారికి వచ్చేదని, ఈ పర్యాయం దీనికి తిలోదకాలు ఇచ్చారన్నారు. చదివింపులు ఎక్కడ ఇవ్వాలో సిబ్బందిని భక్తులు సంప్రదిస్తే హుండీలో వేయమని జవాబివ్వడంతో పలువురు అసంతృప్తితో వెనుదిరిగారని పేర్కొన్నారు. పాత సాంప్రదాయాలను విస్మరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సంప్రదాయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంబుగోళం లోకేష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నల ఎదురుచూపులు



రైతుసేవా కేంద్రం పచ్చిరొట్ట విత్తనాల కోసం వచ్చిన రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా రైతులు పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో సుమారు 3 వేల ఎకరాల్లో పంట పొలాల్లో సత్తువ కోసం పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగలు, పిల్లిపెసరను వేస్తారు. పచ్చిరొట్టను భూమిలో కలియ దున్నితే నేలకు సత్తువ పెరిగి పంటల దిగుబడి పెరుగుతుంది. వర్షాలు మొదలు కావడంతో రైతులు పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. తొట్టంబేడు, వరదయ్యపాళెం మండలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. అయితే బుచ్చినాయుడుకండ్రిగలో మాత్రం ఇప్పటివరకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జూలై నెలాఖరులోపు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయాలని లేకుంటే ఉపయోగం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జూన్ నెలలోనే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ పూర్తి చేసేవారని అంటున్నారు. ఇప్పటికైనా పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు అవుతున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు రుచి, శుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం ఆదేశించారు. బుధవారం ఆయన నీర్పాకోట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. కూరల్లో కూరగాయలను తగినంత మోతాదులో వేయాలని, భోజనంలో తయారీలో నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టీచర్లు పాల్గొన్నారు.

శానిటరీ సూపర్‌వైజర్ ఆగడాలకు అడ్డే లేదా?

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి శానిటరీ సూపర్‌వైజర్ ధనమ్మ ఆగడాలకు అడ్డే లేదా? అని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, ధనమ్మకు విద్యార్హత లేకపోయినప్పటికీ సూపర్‌వైజర్‌గా పెత్తనం చెలాయిస్తోందని ఆరోపించారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న వర్కర్ మునెమ్మ తన కుమారుడు హాస్పిటల్లో చావు బతుకుల మధ్య ఉండడంతో లీవ్ పెట్టిందని, దీనికే ఆమెను తొలగించడం దుర్మార్గమన్నారు.

మోసం.. చంద్రబాబు నైజం

- వరదయ్యపాళెం వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో సత్యవేడు ఇన్‌చార్జ్ రాజేష్
- లక్ష్మీపురంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'కి అపూర్వ స్పందన





బాబు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, లక్ష్మీపురంలో చంద్రబాబు మోసాల గురించి మహిళలకు వివరిస్తున్న రాజేష్

వరదయ్యపాళెం: ఎన్నికల ముందు ఒక మాట.. తర్వాత మరో మాట మాట్లాడడం చంద్రబాబుకు అలవాటే అని.. ప్రజలను మోసం చేయడం ఆయన నైజమని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ విమర్శించారు. వరదయ్యపాళెంలోని కేబీజీ కల్యాణ మండపంలో బుధవారం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నాయుడు దయాకర్‌రెడ్డి అధ్యక్షతన బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీపై మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేష్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రజలకు అమలు చేయలేని హామీలు ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చినవి అమలు చేయకపోగా.. హామీలన్నీ అమలు చేసేశామని స్వయంగా చంద్రబాబే చెప్పడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. తల్లికి వందనం అమలు కేవలం వైఎస్సార్‌సీపీ పోరాట ఫలితమే అన్నారు. ఏడాది కూటమి పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలపై రోడ్లపైకి వస్తే విశేష ప్రజాదరణ లభిస్తుందని, అది చూసి ఓర్వలేని కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు అక్రమ కేసులు, అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గ్రహించాలని హితవు పలికారు.

కూటమి ప్రభుత్వంపై మహిళల ఫైర్

మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ లక్ష్మీపురంలో బుధవారం మధ్యాహ్నం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరించారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల సెల్‌ఫోన్‌లో చంద్రబాబు అబద్ధపు హామీల గురించి వారికి వినిపించారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుద్దు వేణు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి స్థానిక మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మహిళలు కూటమి ప్రభుత్వంలో ఒక్క పథకమూ అందడం లేదని, సామాన్య ప్రజలను నిలువునా ముంచారని రాజేష్ ఎదుట వాపోయారు. అంతేకాక ప్రతి నెలా ఇంటి వద్దకు రేషన్ సరుకులను తీసుకువచ్చే బండిని ఆపి వేయడం వల్ల సరుకులు తీసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. 3 కి.మీల దూరంలో ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లాలంటే ఆటో చార్జీ రూ.50 అవుతోందని, ఆ నగదు చెల్లించి సరుకులు తీసుకోవడం మానేశామని వారు వాపోయారు. అంతేకాక ఉచిత గ్యాస్ అందడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న ముఖ్యమంత్రిగా ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేసుకున్నామని, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.18,750 నగదు, అమ్మఒడి ఇలా చాలా పథకాలు అందాయని, ఇప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ, జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు, రాష్ట్ర యువజన కార్యదర్శి శిబి చక్రవర్తి, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అబ్దుల్, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి శోభన్ యాదవ్, నాయకులు దామోదర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుడు బందిల సురేష్ (బూత్ కమిటీ), వినోద్ యాదవ్ (యువజన), దేవళ్ల మహేంద్ర (బీసీ సెల్), శివా యాదవ్ (ప్రచార కమిటీ), గిరిరెడ్డి (గ్రీవెన్స్ సెల్), మాజీ సర్పంచ్ కవిత పాల్గొన్నారు.